క్లుప్తంగా

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



చిత్రపురిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్

మణికొండ: చిత్రపురి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నామని కౌన్సిలర్ వసంతరావు అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ, చిత్రపురి 2వ వార్డు పరిధిలో మున్సిపాలిటీ నుంచి రూ.10లక్షలతో చేపట్టిన రోడ్డు చదును చేసే పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అవసరమైన మేరకు సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. చేపట్టే పనులను నాణ్యతగా చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో లీకేజీల ప్రభుత్వం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



కండువా కప్పి స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: తెలంగాణలో లీకేజీల ప్రభుత్వం కొనసాగుతోందని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు డస్ట్‌బిన్‌లో వేయడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన గుడిమల్కాపూర్‌లో జరిగిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈనెల 8న రాష్ట్రానికి రానున్న ప్రధాని మోదీ బహిరంగ సభపై చర్చించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది యువకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని అరెస్ట్ చేస్తుందని ఆరోపించారు. మద్యం స్కాం, టీఎస్‌పీఎస్సీ, 10వ తరగతి పేపర్ల లీకేజీలు ప్రభుత్వ పెద్దలకు తెలుసని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్, పవన్‌కుమార్ తదితరులున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు



అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులు నేడు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. కమిషనర్‌గా సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్ కూడా ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

గోల్కొండ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకిలోని ఆయన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సరైన విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా నేరుగా అధికారులను కానీ, తనను కానీ కలిసి పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

హనుమాన్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలో ప్రత్యేక పూజలు..

శంషాబాద్ రూరల్: మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. పిల్లోనిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమాన్ అసోసియేషన్ సభ్యులు నర్సింహా, డి.రాజు, జుర్కి రమేష్ పాల్గొన్నారు.



పిల్లోనిగూడలోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్థానికులు



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు



శోభా యాత్రలో పాల్గొన్న భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ తదితరులు



శీతలపానియాలు, మంచినీళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తదితరులు

శంషాబాద్: శంషాబాద్‌లో హనుజ్జయంతి సందర్భంగా ఆధ్యాత్మికవైభవం వెల్లివిరిసింది. ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. పట్టణంలోని జెండా చౌరస్తా మాతా ఆలయం నుంచి హనుమాన్ శోభా యాత్రను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. హనుమాన్ పాతపోలీస్‌స్టేషన్ మీదుగా బయలుదేరిన ర్యాలీ సిద్ధప్పరోడ్డు, జాతీయరహదారి ఆర్బీనగర్, మధురానగర్ మీదుగా హనుమాన్ దేవాలయం వరకు సాగింది.

యాత్రలో ముస్లిం సోదరులు

పట్టణంలోని నాల్గోవార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు తాజ్‌బాబా, అంజద్, రఫీఖ్‌లు వేర్వేరుగా రెండు ప్రాంతాల్లో శీతలపానియాలు, మంచి నీళ్లు అందించే కౌంటర్లు ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముస్లిం సోదరులను ప్రత్యేకంగా అభినందించారు.

కిస్మత్‌పూర్‌లో

బండ్లగూడ: కిస్మత్‌పూర్‌లో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుండి పురవీధుల గుండా యాత్ర ఊరేగింపుగా కొనసాగింది. శోభాయాత్రలో కమిటీ చైర్మన్ శేఖర్ ముదిరాజ్, లంకల సంగారెడ్డి పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



హనుమాన్ దేవాలయం నుండి మొదలైన శోభాయాత్ర

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో భక్తులు పెద్ద ఎత్తున దేవాలయాలలో పూజలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయాలలో అభిషేకాలు, అర్చనలు, హనుమాన్‌చాలీసా పారాయణాలు, అన్నదానాలు, తమలపాకు పూజలను చేశారు. అనంతరం పుప్పాలగూడ సంకట హర హనుమాన్ దేవాలయం నుంచి నార్సింగి, మణికొండ వరకు శోభాయాత్రను నిర్వహించారు.



మణికొండ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం



మైహోం అవతార్ ముందు చేపట్టిన హనుమాన్ శోభాయాత్ర



మణికొండ ల్యాంకోహిల్స్ పక్కన వీరహనుమాన్ దేవాలయంలో అన్నదానం



శోభాయాత్రలో రాముడు, లక్ష్మణుడు, సీత, హనుమాన్ వేషధారణలో చిన్నారులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మణికొండ: భారతీయ జనతాపార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పలు బూత్‌లలో గురువారం ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నార్సింగి, కోకాపేట, మంచిరేవుల, ఖానాపూర్ తదితర గ్రామాలలో పార్టీ జెండాలను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ, పార్టీ మున్సిపాలిటీల అధ్యక్షులు సి.బీరప్ప, సీహెచ్. బిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.



నార్సింగి సర్కిల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



అత్తాపూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బీజేపీ జెండాల ఆవిష్కరణ

రాజేంద్రనగర్: భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పలు చోట్ల పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అత్తాపూర్‌లో కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్, హైదర్‌గూడలో షాబాద్ విజయ్ కుమార్, రాజేంద్రనగర్‌లో వై. శ్రీధర్, బాబురావు, ఎర్రబోడలో సందీప్ ముదిరాజ్, బుద్వేల్‌లో శ్రీనివాస్‌గౌడ్, గాంధీనగర్‌లో సత్యనారాయణ ముదిరాజ్, భవాని కాలనీలో వేముల మల్లేష్‌లు పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

రాజేంద్రనగర్: బుధవారం రాత్రి కురిసిన ఈదురు గాలుల భారీ వర్షానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అనేక చోట్ల విద్యుత్ వైర్లు తెగిపడటం, స్తంభాలు నేలకొరగటంతో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతారాయం కలిగింది. దాంతో వెంటనే రంగంలోకి దిగిన అధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాత్రంతా కృషి చేశారు. రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆరు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగటంతో గురువారం కొత్తవి ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు. బుద్వేల్‌లో చెట్ల కొమ్మలు విరిగి పడి బ్రేక్ డౌన్ ఏర్పడటంతో పునరుద్ధరించారు.కిస్మత్‌పూర్ గ్రీన్‌సిటీ, బన్సీలాల్‌నగర్ ప్రాంతాలలో మరమ్మత్తులు చేపట్టారు. ఓ వైపు పనులు కొనసాగుతుండగానే గురువారం మరికొన్ని చోట్ల ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతారాయం కలిగింది.

మణికొండలో....

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి కురిసిన ఈదురు గాలుల వర్షానికి పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అప్పటికప్పుడు మరమ్మత్తులు చేపట్టి పలు చోట్ల పునరుద్ధరించారు. శ్రీలక్ష్మీప్రియ కాలనీ, నేతాజీ కాలనీల్లో రాత్రంతా ప్రజలు చీకట్లోనే గడిపారు. గురువారం ఉదయం ఆయా కాలనీల్లో మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వైర్లు వదులుగా ఉండటం, విద్యుత్ వైర్లకు పలు చోట్ల కొమ్మలు సమీపంలో ఉండటం, విద్యుత్ స్తంభాలు వంగి ఉండటంతో ఇలాంటి గాలి, వర్షాలు వచ్చినపుడు సమస్య ఏర్పడుతుందని, వాటన్నింటినీ సరి చేయాలని కాలనీల వాసులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ సరఫరా సమస్య తెలిపేందుకు ఫ్యూజ్ కాల్ సిబ్బంది, అధికారులకు ఫోన్‌లు చేసేందుకు ప్రయత్నించినా స్విచ్ ఆఫ్ వచ్చాయని నేతాజీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

పోలీస్‌స్టేషన్‌కు చేరిన చెత్త సేకరణ ఆటోల పంచాయతీ

రాజేంద్రనగర్: చెత్త సేకరణ ఆటోల పంచాయతీ రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొత్తగా చెత్త సేకరణకు ఆటోలను అనుమతించారు. అప్పటికే పలు వీధులలో చెత్త సేకరిస్తున్న కార్మికులు దాన్ని అడ్డుకున్నారు. సంవత్సరాల తరబడి పనిచేసుకుంటున్న మమ్మల్ని కాదని కొత్త వారికి ఎందుకు ఇచ్చారని అభ్యంతరం తెలిపారు. అదే విషయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. పలు మార్లు అడ్డుకున్నా ఇరు వర్గాలను సముదాయించారు. గురువారం ఉదయం 10వ డివిజన్‌లో వెంకట్ అనే పాత చెత్త కార్మికుడిని అడ్డుకుని కొత్తగా సేకరిస్తున్న వారు చితకబాదారు. దాంతో గాయాల పాలయిన అతను రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వెంకట్‌తో పాటు కార్మికులంతా కార్పొరేటర్‌లు ప్రశాంత్‌నాయక్, లంకల నిఖిలసంగారెడ్డిలను సైతం కలిసి సమస్యను వివరించారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: కడుపు నొప్పి భరించలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన అఖిల రమేష్ బార్యాభర్తలు. వీరికి 8 సంవత్సరాల క్రితం వివాహం జరగగా ఇద్దరు సంతానం ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఆమెకు తరచూ కడుపునొప్పి వస్తుండటంతో ఆసుపత్రిలో చూపిస్తున్నారు.ఈ క్రమంలో బుధవావారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్న ఆమె గురువారం ఉదయం చూసే సరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. దాంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభ చాటుకున్న సీబీఐటీ విద్యార్థులు

మణికొండ: విజయవాడలోని ప్రసాద్ పొట్లూరి సిద్దార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన 24 గంటల జాతీయ స్థాయి హాకథాన్‌లో సీబీఐటీ సీఎస్‌ఈ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. హాకథాన్‌లో విద్యార్థులు మహ్మద్‌సోను. మేఘనాథ్‌రెడ్డి, అభిటెక్, గోపిచంద్‌లు బృందంగా ఏర్పడి పాల్గొన్నారు. వారు హ్యాకథాన్‌లో రెండవ బహుమతిని గెలుచుకుని రూ.20వేల నగదు పురస్కారాన్ని పొందారు. ఈ సందర్భంగా వారిని గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీబీఐటీ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

బందోబస్తు.. ర్యాలీలు ప్రశాంతం

పీఎస్ఐఓసీ నుంచి పర్యవేక్షించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలు ప్రశాంతంగా ముగిశాయి. సైబరాబాద్ పరిధిలో పోలీసుల పర్యవేక్షణలో 184 ర్యాలీలు ప్రశాంతంగా సాగాయి. హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్(పీఎస్ఐఓసీ) ద్వారా ప్రతి క్షణం సిబ్బంది పర్యవేక్షించారు. బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సీపీ స్టీఫెన్ రవీంద్ర పర్యవేక్షిస్తూ ర్యాలీల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ సైబరాబాద్ పోలీసులు ముందస్తుగా తీసుకున్న భద్రతా చర్యల్లో భాగంగా సోషల్ మీడియాపై నిఘా ఉంచామని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ర్యాలీలు ప్రశాంతంగా కొనసాగాయన్నారు.



సైబరాబాద్ కమిషనరేట్‌లో పీఎస్ఐఓసీ సెంటర్

ప్రజాసేవ ఉన్నతమైనది

మణికొండ: ప్రజలకు ఉపయోగపడే పనులు చేయటం ఎంతో ఉన్నత మైందని, అలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అసవరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో లక్ష ఫుడ్‌వేస్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో మంచి నీటిని అందించి బాటసారుల దాహార్తిని తీర్చటమే ఎంతో పుణ్యకార్యం కాగా అలాంటిది మజ్జిగను ప్రతి రోజు అందించటం హర్షణీయమన్నారు. ఎండీ చలమారెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్ నరేందర్‌ముదిరాజ్

ఆటోడ్రైవర్‌ను బెదిరించి రూ.13వేలు దోపిడీ

రాజేంద్రనగర్: ఆటో డ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద రూ. 13వేలు దోపిడీ చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆటో డ్రైవర్ రియాజ్ అర్ధరాత్రి 2 గంటల సమయంలో డెయిరీ ఫాం వద్ద ప్యాసింజర్ల కొరకు వేచి చూస్తుండగా ఇద్దరు యువకులు వచ్చి అతన్ని బెదిరించారు. అతని వద్ద ఉన్న రూ.13వేలను తీసుకుని పారిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని క్రైం ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

ఇఫ్తార్ విందు

గోల్కొండ: ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందించడంతో పాటు యువ వ్యాపారులకు, మహిళలకు రుణాలు అందించడమే తమ లక్ష్యమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం సురేష్ చంద్రతేరి అన్నారు. గురువారం టోలిచౌకి రాహుల్ కాలనీలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఆయన ఇఫ్తార్ విందు లో పాల్గొన్న వారందరికీ రంజాన్ నెల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఠి రీజియనల్ హెడ్ ప్రమోద్ కుమార్‌రెడ్డి, సైఫాబాద్ రీజన్ హెడ్ శ్రీధర్, పంజగుట్ట రీజన్ హెడ్ దండేశ్వరరావు, ఇన్‌కమింగ్ ఆర్‌హెచ్ కల్యాణ్ వర్మ, కోఠి రీజన్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ వీఎస్ఆర్ మూర్తి తదితరులున్నారు.

సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన శ్రీనిత్

మాదాపూర్: మాదాపూర్ రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర,జిల్లా స్థాయిలో జరిగిన సీవీ రామన్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో సత్తా చాటారు. 4వ తరగతికి చెందిన బి.శ్రీనిత్ జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు డీన్ శ్రీలత, ప్రిన్సిపల్ హైమ, డివిజన్ ఇంచార్జ్ హఫీజ్ గురువారం విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువే కాకుండా అన్ని రంగాలలో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

చాటింగ్.. చీటింగ్..

- పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- హనీ ట్రాప్, ఉద్యోగాలు, ఇన్వెస్ట్‌మెంట్, లోన్, కేవైసీ, గిఫ్ట్‌ల పేరిట టోకరా
- బాధితులు తెలంగాణ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ ఫోన్ 1930ని సంప్రదించాలి
- మాదాపూర్ పోలీస్‌స్టేషన్ డీఐ జి.వెంకట్



మాదాపూర్: టెక్నాలజీ ఎంత పెరుగుతుందో సైబర్ నేరాలు అలాగే పెరుగుతున్నాయి. ఎక్కువగా విద్యావంతులు, మేధావులు సైబర్ నేరాలబారిన పడుతున్నారు. ఆన్‌లైన్‌లో యాప్స్ ద్వారా లోన్లు, ఉద్యోగాలు ఇస్తామని, న్యూడ్ చాట్‌లకు ఆహ్వానించి వీడియోలు తీసి బెదిరించి డబ్బులు గుంజుతున్నారని మాదాపూర్ క్రైం డీఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్) జి.వెంకట్ తెలిపారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాలను వాడే వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ మోసాలపై సాక్షికి పలు విషయాలను వివరించారు.

ప్రశ్న. ఎలాంటి నేరాలు ఎక్కువగా ఉన్నాయి.?

జ: ఇన్వెస్ట్‌మెంట్, జాబ్, కేవైసీ, గిఫ్ట్, లోన్ నేరాలు ఎక్కువగా ఉన్నాయి. అత్యాశ, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశం ఉన్నవారు నేరగాళ్ల వలలో పడుతున్నారు. వివిధ రకాల యాప్స్ ద్వారా లోన్ ఇస్తామని చెప్పడం. లక్ష రూపాయల నుండి రూ.5 లక్షల వరకు ఇస్తామని నమ్మబలికి వ్యక్తిగత, బ్యాంక్ సమాచారం యాప్‌లో పొందుపరచడంతో పూర్తి సమాచారం రాగానే అకౌంట్‌ను హ్యాక్ చేసి వారి దగ్గర ఉన్న డబ్బును కాజేస్తున్నారు. లోన్ బ్యాంకులలోనే తీసుకోవాలి.

ప్ర: సైబర్ నేరాలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు.?

జ: హాస్టళ్ల వద్ద, పబ్లిక్ ప్రాంతాలలో, కార్యాలయాలలో, కమ్యూనిటీలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాము. ఆన్‌లైన్ చోరీల గురించి వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. నెల సరి జీతాలు వచ్చినప్పుడు, మార్చి ఎండింగ్(కేవైసీ) సమయంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతుంటాయి. కేవైసీ సమాచారం ఇవ్వాలంటూ వివిధ రకాల బ్యాంకుల నుండి ఫోన్ చేస్తున్నట్టు చేసి సమాచారం రాబట్టి దోచేస్తున్నారు. అందంగా మాట్లాడే అమ్మాయిలని, అబ్బాయిలను ఎంపిక చేసుకుని వారితో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ప్ర: హనీట్రాప్ గురించి..

జ: న్యూడ్ చాట్‌లకు ఆహ్వానిస్తారు. వీడియోలు తీసి బెదిరిస్తారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాలను వాడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలి. అమ్మాయిలు నగ్న వీడియోలతో వల పన్ని తమ ఉచ్చులో చిక్కుకునేలా చేస్తుంటారు. కేవలం 4 నుండి 5 సెకన్లలో నగ్నంగా కనిపించి మాయమవుతారు. వీడియో చూసే దృశ్యాలను రికార్డ్ చేసి మళ్ళీ వారికే పంపి డబ్బులివ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తారు. హనీట్రాప్ వల్ల చాలా మంది యువకులు బ్లాక్‌మెయిల్‌కి గురై మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. అపరిచితులతో చాటింగ్ చేయొద్దు. ఫేస్‌బుక్‌లో అపరిచితుల పరిచయాలకు ఆకర్షితులు కావొద్దు. ఇలా జాగ్రత్తలు పాటించినట్లయితే భద్రంగా ఉంటారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడితే..

ప్రతి సంవత్సరం సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. ఎక్కువ మంది చదువుకున్న వారే వీటి బారిన పడుతున్నారు. ఒక్కొక్కరు రెండు నుండి 5 సార్లు మోసపోతున్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే వెంటనే తెలంగాణ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ 1930కి కాల్ చేయాలి. దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. వెంటనే చేయడం వల్ల పోయిన డబ్బును రికవరీ చేయడానికి వీలుంటుంది. 2022లో 353 సైబర్ నేరాలు వెలుగు చూడగా ..2023 మార్చి వరకు 81 కేసులు నమోదయ్యాయని డీఐ వెంకట్ పేర్కొన్నారు.